# రాజన్న టెండర్లలో లక్కీడ్రా!

- మూడు సంస్థలకు ఒకరే ప్రతినిధిగా హాజరు
- నిబంధనలు అతిక్రమించిన అధికారులు
- గతంలో ఆరోపణలు ఉన్నవారికే దక్కిన టెండర్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లు


లక్కీడ్రా తీస్తున్న సిబ్బంది

వేములవాడ, ఏప్రిల్ 17: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో టెండర్ల వ్యవహారంలో అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. స్వామివారి గోశాల, లడ్డు ప్రసాదం విక్రయశాల, శానిటేషన్ విభాగాల్లో పని చేసేందుకు 52సిబ్బందిని కోరుతూ రాజన్న ఆలయ అధికారులు టెండర్ నోటిఫికేషన్ వేశారు. ఈ టెండర్‌కు 17మంది కాంట్రాక్టర్లు పోటీపడగా, 11మంది అర్హత సాధించారు. అయితే 8మంది మ్యాన్ పవర్ సప్లయి కంపెనీ కలిగిన కాంట్రాక్టర్లు తాము 0.01 శాతం కమిషన్‌తో మాత్రమే సేవలు అందిస్తామని ఒకేవిధంగా టెండర్ కోడ్ చేశారు. దీంతో అధికారులు ఒక్క అడుగు ముందుకు 8మంది పేర్లను సూచిస్తూ లక్కీ డ్రావేసి టెండర్‌ను ఖరారు చేశారు. టెండర్ నిబంధనలో ఎక్కడా కూడా పాటించని నిబంధనను ఎలా డ్రా తీశారం టూ పలువురు కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరును తప్పుపడుతూ రాష్ట్ర లోకాయుక్త, ఏసీబీ అధికారులకు జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**మూడు సంస్థలకు ప్రతినిధిగా ఒక్కరే హాజరు..**

మ్యాన్ పవర్ సప్లై కోసం నిర్వహించిన టెండర్‌కు మూడు సంస్థల నుంచి ఒకరే ప్రాతినిధ్యం వహిస్తూ హాజరుకావడం కూడా విమర్శలకు దారితీస్తోంది. సంస్థ నిర్వాహకులు లేదా ఏజెంట్ మాత్రమే హాజరుకావాల్సి ఉండగా, సంస్థలతో ఎలాంటి సంబంధం లేకుండా మరొకరు హాజరు కావడాన్ని తప్పు పడుతున్నారు. ఈ తీరును అధికారులు కూడా అనుమతించడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. లక్కీడ్రా ద్వారా టెండర్ దక్కించుకున్న సంస్థకు సంబంధంలేని వ్యక్తి హక్కులు దక్కించుకున్నట్లు తెలుస్తున్నది. గతంలో ఓ సంస్థ ద్వారా పనిచేసిన సమయంలో అనేకమంది కార్మికులకు వేతనాలు ఎగ్గొట్టాడన్న ఆరోపణలున్నాయి. అదే వ్యక్తి హక్కులు ఆలయ అధికారులు కల్పిస్తే కార్మికులు ఇబ్బందిపడే అవకాశం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోరగా, తాము ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందిన తర్వాతే లక్కీడ్రా నిర్వహించామని తెలిపారు. నిబంధనలో లేకపోయినప్పటికీ ఒకేవిధంగా అందరూ కోడ్ చేయడంతో అనుమతి తర్వాతే లక్కీడ్రా నిర్వహించామని చెప్పారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

# ప్రొటోకాల్ పాటించలేదని అడగడం తప్పా

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

ముస్తాబాద్, ఏప్రిల్ 17 : సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేటీఆర్ పేరు, ఫొటోను పెట్టడం లేదని నిరసన తెలిపిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం, పోలీసులతో అరెస్టులు చేయించడమేంటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మండిపడ్డారు. మండలకేంద్రంలో గురువారం గంభీరావుపేట మండలకేంద్రంలో జరిగిన ఘటనకు ఆయన స్పందించారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, బాలయ్య, ఆనంద్‌రావు, మనోహర్, స్వామి, నాయకులు దాడిని ఖండించారు. అనంతరం గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట కార్యకర్తలు, నాయకులు నిరసన తెలిపారు.

**సభను విజయవంతం చేద్దాం**

గంభీరావుపేట, ఏప్రిల్ 17 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఈ నెల 27న వరంగల్‌లో తలపెట్టిన రజతోత్సవ సభకు ఇంటింటి నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లి సక్సెస్ చేద్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సభ విజయవంతం చేయడానికి దిశా నిర్దేశం చేశారు. మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, కొత్తపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు భూపతి సురేందర్, నేతలు దయాకర్‌రావు, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, రాజు, రాజిరెడ్డి, రాజేందర్, సత్యం, రత్నాకర్ తదితరులున్నారు.

## సన్నబియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

**అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్**

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17: పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంను సక్రమంగా అందజేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో రేషన్ దుకాణంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు పేదలకు సన్నబియ్యం పంపిణీపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. రేషన్ దుకాణంలోఉన్న స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధికారులు, తదితరులు ఉన్నారు.

## పరిశోధనతో సమస్యలు పరిష్కరించవచ్చు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 17 : పరిశోధనతో సమస్యలను పరిష్కరించవచ్చని అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య అన్నారు. శుక్రవారం వేములవాడ మండల అగ్రహారం డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌తో కలిసి 2025 పరిశోధనా పద్ధతులు, ప్రాజెక్టు వర్క్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, వాణిజ్య విభాగ అధిపతి ఈ వర్క్‌షాప్‌నకు కన్వీనర్‌గా ఉన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా ఐపీఈ డైరెక్టర్, ఎన్ఎల్‌సీ చైర్ ప్రొఫెసర్ సీఎస్ఆర్ ప్రొఫెసర్ ఎన్ శ్రీనివాస్ మూర్తి, ఐపీఈ నుంచి ప్రొఫెసర్ రామకృష్ణ యలమంచిలి రిసోర్స్‌గా ఉన్నారు. బీకాం సెమిస్టర్ విద్యార్థుల కోసం ఈ వర్క్‌షాప్‌ను వారి పాఠ్యాంశాల్లో భాగంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో పరిశోధన, ప్రాజెక్టు పని ఎందుకు ముఖ్యమో, పరిశోధనలో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, వై నర్సయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోనరావుపేట, ఏప్రిల్ 17 : మండలంలోని పల్లిమక్త, సుద్దాల గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు ప్రారంభించారు. వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్‌యాదవ్, తాళ్లపల్లి ప్రభాకర్,తదితరులు ఉన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రుద్రంగి, ఏప్రిల్ 17 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. పోషణ పక్వాడ్, పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని దేగావత్‌తండాలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

రుద్రంగి, ఏప్రిల్ 17 : డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకులుగా డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బూర సదానందం, ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు వంగ తిరుపతి ఆధ్వర్యంలో గురువారం డీటీఎఫ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గడప వేణు, ప్రధాన కార్యదర్శిగా కొప్పు శ్రీధర్, జిల్లా కౌన్సిలర్‌గా కే గోపి, ఉపాధ్యక్షులుగా గడ్డమీది రోహిత్, మన్నాల మాధవి, కార్యదర్శులుగా భూక్యా తిరుపతి, జయశ్రీ, మామిడి తిరుపతి, ఆడిట్ కమిటీ చైర్మన్‌గా బొక్కెన వసంతయ్య, సభ్యులుగా మానస, షేక్ హైమద్‌ను ఎన్నుకున్నారు. వేణు మాట్లాడుతూ, మండల పరిధిలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్లు అంబటి శంకర్, మంగళగిరి చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లాడ్జీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : లాడ్జీలను కేంద్రంగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ మహేశ్ బీ గితె హెచ్చరించారు. గురువారం ఒక ప్రటకన విడదుల చేశారు. ప్రతి లాడ్జీలో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యజమానులను ఆదేశించారు. లాడ్జీకి వచ్చే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ధార్మిక క్షేత్రమైన వేములవాడలోని నాలుగు లాడ్జీల్లో సీసీ కెమెరాలు లేక పోవడంతో నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం పది పోలీసు బృందాలు వేములవాడ పట్టణంలోని 50 లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుంటే యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అనుమానితులు వస్తే వెంటనే సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సీసీ కెమెరాలు లేని లాడ్జీలకు నోటీసులు జారీ చేసిన వివరాలను వెల్లడించారు. వేములవాడలోని విఘ్నేశ్వరలాడ్జీ, రేణుకమాతా లాడ్జీ, దేవన్నలాడ్జీ, చిట్టిబాబు కాంప్లెక్స్ ఉన్నట్లు తెలిపారు.

## అటవీభూమి అన్యాక్రాంతం

**యథేచ్ఛగా చెట్ల నరికివేత**


మల్యాల శివారులో అటవీ భూమిలో నరికేసిన చెట్లు

చందుర్తి, ఏప్రిల్ 17 : వన్యప్రాణులకు అలవాలమైన అభయారణ్యం అక్రమార్కుల వికృత చర్యలతో ప్రశ్నార్థకంగా మారింది. కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు ఉండడం అక్రమార్కుల ఆగడాలకు అంతేలేకుండా పోయింది. మండలంలోని మల్యాల, లింగంపేట, సనుగుల, చందుర్తి, తిమ్మాపూర్, నర్సింగాపూర్, రామన్నపేట శివారు ప్రాంతాల్లో భూమి విస్తరించి ఉంది. కొన్నేళ్లుగా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విచ్చలవిడిగా కలపను నరికేస్తున్నారు. ఇదిలా ఉంటే కొందరు రైతులు వారి సాగు భూమిని ఆనుకొని ఉన్న అటవీ భూమిని కలిపేసుకుంటున్నారు. స్మగ్లర్లు సామిల్లులతో ఒప్పందం కుదుర్చుకొని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యహరించడం గమనార్హం.

## సారూ.. మిమ్మల్ని మరువలేం

**వైద్యాధికారిని తలుచుకుంటూ సిబ్బంది కన్నీటి పర్యంతం**


వేదాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

చందుర్తి, ఏప్రిల్ 17: మచ్చలేని వైద్యుడిగా పేరుగాంచి న వైద్యాధికారి వేదాచారి మరణంపై సర్వత్రా విషాదం నెలకొన్నది. అనతికాలంలోనే ప్రజల మన్ననలను పొందిన తొలి వైద్యుడిగా నిలిచారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, కొనియాడారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వేదాచారి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించారు. విద్యార్థి దశలోనే క్యాన్సర్‌తో పోరాడుతూ ఎంబీబీఎస్ పూర్తి చేశారని ప్రైవేట్ వైద్యం కాకుండా ప్రభుత్వ వైద్యం ప్రతి వ్యక్తికి అందాలనే సిద్ధాంతంతో పనిచేశారని గుర్తుజేశారు. ఈ నేపథ్యంలో వేదాచారిని స్మరిస్తూ వైద్యులు, సిబ్బంది భావోద్వేగానికి గురయ్యారు. సదరు ప్రాంతంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

## ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

కలెక్టరేట్, ఏప్రిల్ 17: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెల్లి కల్యాణ్ కుమార్, మల్లారపు ప్రశాంత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను జిల్లా కమిటీ ఆవిష్కరించారు. విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాజన్నసిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సామల్ల సాయి భరత్, కడారి శివ, నాయకులు శ్రీధర్, రాబిన్సన్, సాయి, చరణ్,అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండలతో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా లేబర్ అధికారి నజీర్ అహ్మద్**


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నజీర్ అహ్మద్

వేములవాడ, ఏప్రిల్ 17: వేసవికాలం కావడంతో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా లేబర్ అధికారి నజీర్ అహ్మద్ సూచించార. గురువారం వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు కడారి రాములు, ఎల్లారెడ్డి, గుర్రం అశోక్, దేవరాజు, కోరేపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 'రాజీవ్ యువశక్తి' రుణాల కోసం ఇంటర్వ్యూలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17: ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువశక్తి పథకంలో భాగంగా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో కలిసి ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు దారుల ధ్రువపత్రాలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనజర్ మల్లికార్జున్, ఎస్‌బీఐ బ్రాంచి మేనజర్ రంజిత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

చందుర్తి, ఏప్రిల్ 17: మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఆ పథకానికి సంబంధించి నైపుణ్యంపై ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్, రుద్రంగి, మల్యాల యూనియన్ బ్యాంక్ అధికారులు తదితరులు ఉన్నారు.

# 51 సంచుల తలనీలాలు అప్పగింత

- రాజన్నకు ₹3.54కోట్ల బాకీ ఉన్న కాంట్రాక్టర్‌కు
- మిగిలిన తలనీలాలు అప్పగించిన అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 17: వేములవాడ రాజన్న ఆలయంలో మిగిలిన తలనీలాలను సదరు కాంట్రాక్టర్‌కు గురువారం రాజన్న ఆలయ అధికారులు అప్పగించారు. అయితే రాజన్న ఆలయంలో 2023–25 సంవత్సరాలకు గానూ తలనీలాలను సేకరించుకునే హక్కులను ఆంధ్రప్రదేశ్ హిందూపురం చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కాంట్రాక్టర్ ₹19 కోట్ల ఎనిమిది వేలకు టెండర్ దక్కించుకున్న విషయం తెలిసిందే. హక్కులు పొందిన సదరు కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్ నుంచి నగదు చెల్లించకపోగా, స్వామివారికి బాకీపడుడూ వచ్చాడు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 31నాటికి ఆలయ అధికారుల వద్ద నిల్వ ఉన్న తలనీలాలను కాంట్రాక్టర్‌కు అప్పగించాలని ఆదేశించింది. అయితే అప్పటివరకు రాజన్నకు బాకీ ఉన్న ₹7కోట్లు వాయిదాల పద్ధతిలో చెల్లించాలని కూడా సూచించింది. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏప్రిల్ 11 నాటికి ₹3.5కోట్లు రాజన్న ఆలయానికి చెల్లించారు. ఇక మిగిలిన ₹3.54 కోట్లు జూన్ మాసం నుంచి డిసెంబర్ వరకు వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ఇప్పటికే ఆలయ అధికారులకు చెక్కులను అందజేశారు. ఇక ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అతడు బాకీ ఉన్న పైసలకు వెసులుబాటు కల్పిస్తూ జనవరి నుంచి ఏప్రిల్ 11 నాటికి ఆలయ అధికారుల వద్ద నిల్వ ఉన్న 51సంచుల తలనీలాలను కూడా అప్పగించాలని దేవాదాయ శాఖ కమిషనర్ రాజన్న ఆలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆలయ అధికారులు గురువారం మిగిలిన మొత్తం తలనీలాలను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇక బాకీ విషయంలో కాంట్రాక్టర్ ఏ మేరకు నిబంధనలో కట్టుబడి చెల్లిస్తాడో లేదో రాజన్నకే తెలియాలి.

## వడదెబ్బతో ఆటో డ్రైవర్ మృతి


శంకరయ్య (ఫైల్)

వేములవాడ రూరల్, ఏప్రిల్ 17: వడదెబ్బ తగిలి ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాజీపేట గ్రామానికి చెందిన ఆరెల్లి శంకరయ్య(46) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు వారి మాదిరిగానే బుధవారం కూడా వేములవాడ–హన్మాజీపేటకు ఆటో కిరాయికి వెళ్లాడు. రాత్రి ఇంటికెళ్లిన తర్వాత తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందాడు. వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకరయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.

## ఒలింపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 : మండల కేంద్రానికి చెందిన దుంపేటి లాస్య ఇండియన్ నేషనల్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభను చాటగా ఆమెకు ల్యాప్‌ట్యాప్, గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం తమ విద్యార్థి లాస్యను అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అన్నపూర్ణ, కోఆర్డినేటర్ రాంబాబు అభినందించారు.

## దొంగల బీభత్సం


విచారణ చేపడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, ఏప్రిల్ 17 : మండలకేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే చోరీ జరగడం గమనార్హం. మండల కేంద్రానికి చెందిన సిర్రం రాజవ్వ, వెంగల వినోద, ప్రశాంత్ ఇండ్లలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రాజవ్వ రోజువారీగా కోడలు ఇంట్లో పడుకోవడానికి వెళ్లగా, వినోద ఉగాది పండుగకు కరీంనగర్‌లోని కొడుకు వద్దకు వెళ్లగా తాళం వేసి ఉండడంతో తలుపులు పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం తాళం పగలి ఉండడానికి గమనించిన స్థానికులు రాజవ్వ, వినోదకు సమాచారం ఇచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య ఘటనాస్థలికి చేరుకొని పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. క్లూస్ టీం అనుమానిత ప్రాంతాల్లో ఆధారాలను సేకరించింది. కాగా, రాజవ్వ ఇంట్లో రూ. 15 వేల నగదు, వినోద ఇంట్లో రూ. 25 వేల నగదు చోరీ చేశారని వారు విలపించారు. అలాగే పాస్టర్‌గా పనిచేసే ప్రశాంత్‌కు చెందిన పల్సర్‌బైకు ఎత్తుకెళ్లారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ఇల్లంతకుంట రూరల్,ఏప్రిల్17: మండలంలోని పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ కేతిరెడ్డి రాంరెడ్డి ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎగుమామిడి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి,కృష్ణహరి, రవీందర్‌రెడ్డి,పాశం రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

- శృంగేరి పీఠం అనుమతులు తీసుకుని పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తాం
- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్


మాట్లాడుతున్న శైలజారామయ్యార్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 17: భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ పేర్కొన్నారు. గురువారం వారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తర్వాత వారు ఆలయ ప్రాంగణం, పరిసరాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించా రు. అనంతరం ఆలయ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రూ.38కోట్లు ప్రకటించారన్నారు. ఆగమశాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని కార్యాచరణ రూపొందిస్తున్నామన్నా రు. శృంగేరి పీఠం నుంచి అనుమతులు పొం దిన తర్వాతనే వారిని అనుసరిస్తూ అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఆలయ అభివృద్ధితోపాటు, పట్టణాభివృద్ధి సమాంతరంగా జరగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న పాటు పట్టణాన్ని కూడా సమాంతరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయ విస్తీర్ణం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35కోట్లు మంజూరు చేసిందన్నారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకొని ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆలయ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేశామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీకి సంపూర్ణ సహకారమందిస్తామన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, ధార్మిక సలహాదారుడు గోవిందహరి, ఈవో వినోద్‌రెడ్డి, స్థపతి వల్లీ నాయగం, ఆర్కిటెక్ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్‌రెడ్డి, సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్ఈ లక్ష్మణ్, ఈఈ రమణయ్య, ఆలయ ఈఈ రాజేశ్, డీఈ మధు రఘునందన్, స్థానాచార్యుడు ఉమేశ్, ఉపప్రధాన అర్చకుడు రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

**ప్రజాసంఘాల నాయకుడు అరుణ్ కుమార్**



మాట్లాడుతున్న మల్లారపు అరుణ్‌కుమార్

కలెక్టరేట్, ఏప్రిల్ 17: పోడు భూముల పోరాటంలో పాలొన్న ప్రజాసంఘ నాయకుల పై అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పోడు భూముల పోరాటంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులపై పెట్టినా కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిరిసిల్లలోని బీవైనగర్‌లో అమృత లాల్ శుక్ల కార్మిక కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ, పోడు రైతుల పక్షాన నిలబడి పేదలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జాలపల్లి మనోజ్ కుమార్, ఇసంపెల్లి కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సంఘిభావానికి వెల్దామనుకుంటే

- అడ్డగించి, అభ్యంతరం చెప్పిన పోలీసులు
- వెంకటాపూర్‌లో నిలిపివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 : గంభీరావుపేటలో ప్రొటోకాల్ ప్రకారం.. ఎమ్మెల్యే కేటీఆర్ ఫ్లెక్సీ ఎందుకు పెట్టలేదని అడిగిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడికి దిగిన ఘటన తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి గంభీరావుపేటకు వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. వెం కటాపూర్ బైపాస్ రోడ్డు వద్ద ఇద్దరు నాయకులు వెళ్తున్న కారును నిలిపేసి సంఘిభావానికి వెళ్లకుండా ఆపేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఇది ప్రజాపాలన కాదని నిర్బంధ పాలనని విమర్శించారు.


పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చందుర్తి,ఏప్రిల్ 17: నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా పాఠశాల వార్షికో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎస్ జలందర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అధునాతనమైన బోధనా పద్ధతులతో పిల్లల భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లు తెలిపారు. ఆటపాటలతో పాటు చక్కటి క్రమశిక్షణతో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన పలువురుని ఆకట్టుకున్నాయి.

## వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా అజయ్ కుమార్

వేములవాడ, ఏప్రిల్ 17: వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా అజయ్‌కుమార్ జాదవ్‌ను నియమిస్తూ బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న అజయ్‌కుమార్‌జాదవ్‌ను రాష్ట్ర హైకోర్టు వేములవాడకు బదిలీ చేసింది.

## బాధిత కుటాబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17: తంగళ్లపల్లి మండలంలో పలువురి మృతుల కుటుంబాలను గురువారం బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. బద్దెనపల్లిలో కూర అంజిరెడ్డి తండ్రి రాజిరెడ్డి, లక్ష్మీపూర్‌లో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సింగిరెడ్డి భూపతిరెడ్డి కూతురు సత్తవ్వ మృతి చెందారు. ఈ మేరకు వారి కుటుంబాలను పరామర్శించి, వారి మృతికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరిలో బీఆర్ఎస్ సీనియర్ నేత రాజు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, తెలంగాణ జాగృతి మండలాధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, మిట్టపల్లి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.


## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కోనరావుపేట, ఏప్రిల్ 17: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. కనగర్తి గ్రామంలో రెడ్డి సంఘంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. చింతోజీ భాస్కర్, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

వేములవాడ, ఏప్రిల్ 17: గంజాయి విక్రయదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణంలో యువత మత్తుకు బానిసై ఇటీవల సంఘటనలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

## రైతు భరోసా ఇంకెప్పుడు


మాట్లాడుతున్న మండల రైతు సంఘం అధ్యక్షుడు పెంటయ్య

చందుర్తి,ఏప్రిల్17: రైతు భరోసా ఇంకెప్పుడు ఇస్తారని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు గురువారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైన పెట్టుబడి సాయంపై కాంగ్రెస్ శ్రేణులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఆర్థిక చేయూత అందిస్తామంటూనే రైతులను దోచుకుంటున్నారన్నారు. మాజీ సర్పంచ్ సంటి బాబురావు,గాజుల సత్తయ్య, నాగరాజు,కనుకయ్య, లచ్చిరెడ్డి, సుధాకర్,లక్ష్మీరాజం, కృష్ణారెడ్డి ఉన్నారు.

## పంటేసినా.. రైతు బంధు రాలే

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 : పంట పండిస్తున్న భూములకు రైతుబంధు వేస్తామంటూ అధికారులు ఇటీవల సర్వే చేసినప్పటికీ మండల కేంద్రంలో ఓ రైతు తాను పంట పం డించినా రైతుబంధు రాలేదని శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశాడు. మండల కేంద్రానికి చెందిన లింగాల దాసు అనే రైతు భార్య బాలమణి పేరుమీద దుమాల రోడ్డును ఆనుకుని 1.30 ఎకరాల భూమి ఉండగా అందులో వరి పంట వేశాడు. తన పక్కనున్న కొందరికి రైతుబంధు డబ్బులు వేసినప్పటికీ తనకు మాత్రం రాలేదన్నాడు. ఇప్పటికే పలు మార్లు అధికారుల వద్దకు వెళ్లాలనని తాను పంట పండిస్తున్న పొలానికి ఎందుకు వేయలేదని అడిగిన సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపాడు. దీనిపై వ్యవసాయాధికారులను అడిగితే వర్షాకాలం పంటకు వేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని ఆరోపించాడు.